ప్రజాశక్తి
ఆదివారం 10 డిసెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

వర్షపునీటిలోనే ఉన్న పంటను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

తుపానుకు పంట నష్టపోయిన

రైతులకు పరిహారం చెల్లించాలి

- కౌలు రైతులను ఆదుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-చీరాల

తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతుల పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించి.. నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య అన్నారు. శనివారం మండలంలోని గవినివారిపాలెం, కావూరివారిపాలెంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతుల పంట పొలాలను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు వేసిన మినుము, మొక్కజొన్న, వేరుశనగ పంటలు నీటి మునిగి ఉరకెత్తిపోయాయన్నారు. వర్షాలు తగ్గి నాలుగు రోజులు గడిచినా.. నేటికీ చేలలో నీరు నిలిచే ఉన్నాయని, ఫలితంగా మినప పంట ఉరకెత్తి కుళ్లిపోయిందని చెప్పారు. ఎకరాకు ఇప్పటి వరకు రూ.15 వేల నుండి 25 వేల దాకా పెట్టుబడి పెట్టామని, ఎకరాకు రూ.15 వేల నుండి రూ.20 వేల వరకు ముందే కౌలు చెల్లించామని రైతులు సిపిఎం బందం ముందు ఆవేదన వ్యక్తం చేశారు ఇంత జరిగినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదని, తమ పొలాలను పరిశీలించలేదని చెప్పారు. నష్టాన్ని పరిశీలించేందుకు అధికారులు రాలేదన్నారు. ముందుగా సిపిఎం నాయకులు ▶ 2లో

ప్రాజెక్టు గేట్లే మరమ్మతులు చేయలేని..

ఈ సిఎం రాజధాని కడతారా..?

- కాలువల్లో పూడికలు తీయించి ఉంటే..
  రైతులు నష్టపోయి ఉండేవారు కాదు..
- అన్నదాతల పక్షాన న్యాయపోరాటం చేస్తా..
- టిడిపి అధినేత చంద్రబాబునాయుడు

దెబ్బతిన్న పొగాకును పరిశీలిస్తున్న చంద్రబాబు, ఏలూరి సాంబశివరావు, నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, పర్చూరు

'ప్రాజెక్టుకు గేట్లు మరమ్మతులు చేయలేని ముఖ్యమంత్రి రాజధాని కడతారా.?' అంటూ సిఎం జగన్‌నుద్దేశించి మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు విమర్శించారు. వాగులు, కాలువల్లో పూడికలు తీసి సక్రమంగా మరమ్మత్తులు చేయించినట్లయితే నేడు రైతులు ఇంతగా నష్టపోయే వారు కాదని, ప్రస్తుత రైతుల దుస్థితికి సిఎం జగన్ బాధ్యత వహించాలని అన్నారు. పర్చూరు మండలం, చెరుకూరులో తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఆయన అనంతరం తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. ప్రజలను మోసం చేస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తూ ముఖ్యమంత్రి బతికిపోవాలనుకుంటున్నారని ఆరోపించారు. పంటలు నష్టపోతే విత్తనాలు ఇవ్వలేని ప్రభుత్వం మనకు అవసరమా? అని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు ముద్దులు పెట్టి తర్వాత పిడుగులు గుద్దడంలో జగన్మోహన్‌రెడ్డి దిట్ట అన్నారు. తాను నేరాలు చేస్తూ పర్చూరులో కూడా ఒక నేరగాడిని దిగుమతి చేశారని చెప్పారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానం వల్ల దేశానికి అన్నం పెట్టే రైతు అప్పులపాలైపోతున్నాడని చెప్పారు. వైసిపి నాయకులు దోచుకున్న డబ్బులను జప్తు చేయాలని చంద్రబాబును ఒకరు సభలో కోరగా అవినీతి సొమ్ము అంతా ప్రజాధనమే అని. అన్ని లెక్కలూ తీస్తామని చెప్పారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఏమీ చేయలేననే బాధ ఉన్నా రైతుల పక్షాన నిలబడి న్యాయపోరాటం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. తుపాన్ ప్రభావంతో నష్టపోయిన చెరుకూరుకు చెందిన మిర్చి రైతు గడ్డం శ్రీనివాసరావుకు రూ.2 లక్షలు ఆర్థికసాయం ప్రకటించారు. పంటల పరిశీలన కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవి కుమార్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, శ్రీదేవి, బాపట్ల, చీరాల పార్టీ ఇన్‌ఛార్జిలు నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య పాల్గొన్నారు.

సపోర్టు చేస్తానంటేనే పోటీ చేస్తా..

- అప్పులు చేసి..
  రాజకీయాలు చేస్తున్నా..
- ఓటర్ లిస్టు వెరిఫికేషన్
  చేయాలని చెప్పినా
  ఎవరూ పట్టించుకోవడం లేదు..
- మంచిగా ఉండి..
  తప్పుకోవాలనుకుంటున్నా..
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే
  బాలినేని శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'మంచిగా ఉండి.. తప్పుకోవాలనుకుంటున్నా.. ఇళ్లస్థలాలు ఇవ్వకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని చెప్పా.. ఈ విషయం జనగ్‌కు కూడా చెప్పా.. ఎలాగో ఇళ్లస్థలాలు ఇస్తున్నాం.. అందరూ కలిసికట్టుగా ఉండి నాకు సపోర్టు చేస్తానంటేనే ఈ సారి పోటీ చేస్తా.. లేకపోతే లేదు..' అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపి క్యాడర్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఒంగోలులో జరిగిన 'అన్న' సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు ఇరిటేటింట్‌గా ఉన్నాయని.. ఒక కులం వాళ్లు రేపు రోడ్లమీదకు వచ్చి పని చేస్తారని, వైసిపి క్యాడర్ అంతా కలిసికట్టుగా పనిచేస్తానంటేనే ఈధఫా ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని చెప్పారు. ప్రస్తుత రాజకీయాలు తన కుటుంబాన్ని బాధిస్తున్నాయని చెప్పారు. ఈ క్రమంలో తన కుమారుడిని రాజకీయాలలోకి తేవాలా..? వద్దా అనే ఆలోచనలో పడే పరిస్థితి ఉందన్నారు. తాము ఏం చేయకపోయినా తమమీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా ఓటర్ లిస్టుల వెరిఫికేషన్ జరుగుతోందని, జాగ్రత్తగా చూడాలని కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులకు చెబితే ఎవరూ పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. ఇలాంటి పరిస్థితుల్లో తాను ఎలా పని చేయాలో అర్థం కావడం లేదన్నారు. తానే నీతి పరుడనని చెప్పట్లేదని వ్యాఖ్యానించారు. ఒంగోలు నియోజకవర్గంలో తాను ఎక్కడా డబ్బులు తీసుకోలేదని, మంత్రిగా ఉన్నప్పుడు బయట ఎక్కడైనా డబ్బులు ఇస్తే తీసుకున్నానని, అలా తీసుకోకపోతే తాను రాజకీయాలు నడపలేనని స్పష్టం చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా చేసిన తాను సంపాదించింది ఏమీ లేదన్నారు. వాస్తవానికి తాను అప్పులు చేసి రాజకీయాలు చేస్తున్నానని చెప్పారు. గత ఎన్నికల్లో కూడా ఎన్నికల ఖర్చు తన వియ్యంకుడు పెట్టాడని చెప్పారు. తాను గిద్దలూరులోనో, మరో చోటో పోటీ చేస్తానని ప్రచారం జరుగుతోందని, పోటీ చేస్తే ఒంగోలులోనే చేస్తానని చెప్పారు. మళ్లీ జగనే సిఎం కావాలని తన కుమారుడు కోరుకుంటున్నారని, ఆయనకు కూడా మా మీద ఆ అభిమానం ఉండాలి కదా అని, ఉండాలనే కోరుకుంటున్నామని అన్నారు.

పెద్ద హీరోతో సినిమా తీస్తా..

తనకు సినిమా తీయాలనే కోరిక బలంగా ఉందని, ఈ కోరికతో అప్పట్లో చెన్నై కూడా పోయానని బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో మోహన్‌బాబుతో సినిమా తీయాలని అనుకుంటే కుదరలేదన్నారు. భవిష్యత్తులో మాత్రం ఖచ్చితంగా సినిమా తీస్తానని చెప్పారు. చిన్న సినిమా తీయనని, భారీ బడ్జెట్‌తో, పెద్ద హీరోతో సినిమా తీస్తానని చెప్పారు. హీరోతో మాట్లాడి ఒంగోలులో షూటింగ్ జరిగేలా చూస్తానని చెప్పారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

భవిష్యత్‌లో గుండ్లకమ్మ ప్రాజెక్టు ఉండదేమో..?

ప్రాజెక్టును పరిశీలించిన రైతుసంఘం నేతలు 3లో

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 18 మందికి
  గాయాలు
- జిజిహెచ్‌కు తరలింపు 3లో

రైతులకు పరిహారం చెల్లించాలి

(మొదటిపేజీ తరువాయి)

గ్రామంలో రచ్చబండ వద్ద రైతులతో కలిసి మాట్లాడారు. అనంతరం గౌనివారిపాలెం, వేదులపల్లి రోడ్డులోని పంట పొలాలను పరిశీలించారు. అక్కడ రైతులనుద్దేశించి గంగయ్య మాట్లాడుతూ గవినివారిపాలెం, కావూరివారిపాలెంలలో రైతులకు జరిగిన నష్టాన్ని అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం అందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం చీరాల నాయకులు ఎం.బాబురావు, పి.కొండయ్య, గ్రామ రైతులు సుధాకర్, సుందరయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మాయమాటలు చెప్పి విద్యార్థినిని ఇంటికి పిలిపించుకోవడమే కాకుండా ప్రశ్నించిన విద్యార్థిని సోదరుడిపై కత్తితో దాడి చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్‌ను డీఈవో విఎస్ సుబ్బారావు శనివారం సస్పెండ్ చేసినట్లు ఎంఈవో మస్తాన్ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఎంఈవో కార్యాలయానికి సస్పెన్షన్ ఉత్తర్వులు అందినట్లు తెలిపారు.

నేడు కార్తీకమాస వన భోజనాలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

సగర ఉప్పర వంశస్థుల సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజనాల కార్యక్రమం ఆదివారం ఉదయం 8 గంటలకు కొండేపల్లి రోడ్డులోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షులు సతికెల రామకృష్ణ, అధ్యక్షులు కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మేడిగ వీరాంజనేయులు, కోశాధికారి మట్టం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్తీక మాస వన భోజనాల కార్యక్రమానికి మార్కాపురం డివిజన్ పట్టణ, గ్రామీణ సగర సోదర సోదరీమణులందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

వికలాంగులు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వికలాంగులు అభివృద్ధి చెందాలని ఆర్డీటీ ఐడీ సెంటర్ డైరెక్టర్ జులేఖ అన్నారు. ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం శనివారం పెద్దదోర్నాలలో నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డి పుష్పలత, ఐడీ సెంటర్ మేనేజర్ నరసింహులు, సుధీర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ బాషా, ఏటిఎల్ వేమయ్య, బాషా, శ్రీనివాసులు, రమణ, రాజారత్నం, లక్ష్మీబాయి, జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రహదారి విషయంలో అపోహలు వద్దు

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి-కనిగిరి

దశాబ్దాల కాలంగా అధ్వానంగా ఉన్న కాశీపురం-తుమ్మకుంట రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా తారురోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్న తరుణంలో గ్రామస్తులు తమ సొంత స్థలాలు కొంతమేర రహదారి నిర్మాణం వల్ల కోల్పోవలసి వస్తుందని, రహదారి నిర్మాణ విషయంలో సందేహాలు వ్యక్తం చేస్తూ, పనులను నిలిపివేయాలని చూశారు. విషయం తెలుసుకున్న కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆ ప్రాంతానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు లేవనెత్తిన పలు సందేహాలను మున్సిపల్ చైర్మన్ నివృత్తి చేశారు. రహదారి నిర్మాణం సందర్భంగా ఏ ఒక్కరిదీ గజం స్థలం కూడా ఆక్రమణకు గురికాదని, ఈ విషయంలో సందేహాలు అవసరంలేదని స్థానిక ప్రజలకు భరోసా కల్పించారు. ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఈ ప్రాంత ప్రజలు రహదారి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి, నిధులు రాబట్టి, రహదారి నిర్మాణ పనులు చేపట్టామని, ఈ రోడ్డు పూర్తి అయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాసరి మురళి, మన్సూర్, మాలకొండారెడ్డి, కోటిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఆశా కిరణాలు ఆషాశ్రీ, కావ్య శ్రీరాం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బ్యాడ్మింటన్ పోటీల్లో జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన చిన్నారి దండు ఆషాశ్రీ భారత బ్యాడ్మింటన్‌లో ఆశాకిరణంగా వెలుగొందాలని టీటీడీ సభ్యులు, లార్డ్ కృష్ణ బాడ్మింటన్ అకాడమీ ఛైర్మన్ శిద్దా సుధీర్ కుమార్ ఆకాంక్షించారు. ఒంగోలు లార్డ్ కృష్ణ అకాడమీలో శిక్షణ పొందిన పదేళ్ల చిన్నారి దండు ఆషాశ్రీ, విజయవాడలో శిక్షణ పొందిన కావ్య శ్రీరాం నవంబర్ 15 నుంచి 18 వరకు జాతీయ బాలికల డబుల్స్‌లో బంగారు పతకం సాధించారు. అలాగే ఆషాశ్రీ బాలికల సింగిల్స్‌లో రజత పతకాన్ని సాధించింది. జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన ఆషాశ్రీ, కావ్య శ్రీరాంలను ఒంగోలులోని లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ కార్యాలయంలో శనివారం సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శిద్దా సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. పిన్న వయసులోనే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడమే కాకుండా అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడం అభినందనీయమని అన్నారు. జన్మనిచ్చిన తలిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, పుట్టిన ఊరికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెస్తున్న చిన్నారిని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నానని చెప్పారు. క్రీడలతో పాటుగా చదువులో కూడా ఇదే పట్టుదల ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలోని బ్యాడ్మింటన్ క్రీడాకారులకు తమ అకాడమీ అండగా ఉంటుందని చెప్పారు. తాము స్థాపించిన లార్డ్ కృష్ణ బాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందిన ఆషాశ్రీ కలకత్తాలో జరిగిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందని అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి మురళీకృష్ణ అన్నారు. తమ సంస్థలో 50 మంది పిల్లలు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. బాడ్మింటన్ క్రీడల్లో జాతీయ స్థాయి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ బీఎన్ శశిధర్, ప్రముఖ న్యూరోసర్జన్ కేవి చంద్రశేఖర్ ఆషాశ్రీని అభినందించారు. అనంతరం గోల్డ్ మెడల్ విజేత ఆషాశ్రీ, కావ్య శ్రీరాంలతో పాటుగా బాలుర డబుల్స్ విభాగంలో కే సుహాస్, కోచ్ అమన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సెక్రటరీ ఏ పద్మప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ శశిధర్, ఎం రఘుబాబు, డి శ్రీనివాస్, ఏ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న దృశ్యం

ఎస్ఐ కోటయ్యను సన్మానిస్తున్న దృశ్యం

పిసి పల్లి ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి-పిసిపల్లి: పిసిపల్లి ఎస్ఐ జి కోటయ్యను మురుగుమ్మికి చెందిన వైసిపి నాయకులు వారితో మాట్లాడి అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. కులమతాలకు అతీతంగా చట్టాలను అమలు చేస్తామన్నారు. తమ పరిధిలోకి వచ్చే కేసులను పరిశీలించి బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. తమ వద్దకు వచ్చే వారికి ఎలాంటి రాజకీయ సిఫారసులు అవసరం లేదన్నారు. డైరెక్టుగా బాధితులు తమ సమస్యలను చెప్పుకోవచ్చునన్నారు. అనంతరం శాలువాతో ఎస్ఐని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నలగంగు శ్రీనివాసులు, లెక్కల కొండారెడ్డి, లెక్కల సుబ్బారెడ్డి ఉన్నారు.

రోడ్డును రిపేరు చేస్తున్న ప్రొక్లైయిన్

మాగుంట సహకారంతో రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-దర్శి: తాళ్లూరు మండలం తురకపాలెం గ్రామంలో పాపిరెడ్డిపాలెం రోడ్డులో హైస్కూల్ దగ్గర నుంచి సాగర్ కాలువ వరకు రెండు కిలోమీటర్ల మేర గుంతలుగా ఉన్న రోడ్లు మరమ్మతులు చేసి ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, యువ నాయకులు రాఘవరెడ్డి సహకారంతో గ్రామంలో రోడ్డు వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపారు.

అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తున్నట్లు యర్రగొండపాలెం అటవీ క్షేత్రాధికారి ఏవి నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని దద్దనాల ఆంజనేయల దేవస్థానానికి వెళ్లే భక్తులకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, వస్తువులు అటవీ ప్రాంతంలో వదిలేయడం వల్ల వాటిని అటవీ జంతువులు తిని మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు. అందుచేత దద్దనాల వెళ్లే భక్తులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, వస్తువులను అటవీ ప్రాంతంలో వదిలివేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంజివారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, కొలుకుల సెక్షన్ అధికారి ఎం వెంకటేశ్వర్లు, షేక్ ఖాజా, నాగేశ్వరరావుతో పాటు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖాధికారులు

ఐకమత్యంతో మెలగాలి: తాతిరెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రెడ్లంతా ఐకమత్యంతో మెలగాలని శ్రీశైలం రెడ్డి నిత్య అన్నదాన సత్రం జాతీయ ప్రధాన కార్యదర్శి గొలమారి తాతిరెడ్డి తెలిపారు. శనివారం యర్రగొండపాలెం రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలో కార్తీక వన సమారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాతిరెడ్డి మాట్లాడుతూ రెడ్లంతా సంఘం అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. సేవా కార్యక్రమాలు చేసి సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం ప్రచార కన్వీనర్ ప్రొద్దులూరి యల్లారెడ్డి, రాష్ట్ర రెడ్డి జేఏసీ ఉపాధ్యక్షుడు నర్రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. అనంతరం భారత్ మహిళా కోలాట బృందం వారిచే నిర్వహించిన కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం రెడ్డి సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి, మోర్తాల సుబ్బారెడ్డి, అధ్యక్షులు చిట్టేల వెంగళరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆవుల రమణారెడ్డి, కోశాధికారి కందుల నారాయణరెడ్డితో పాటు యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల రెడ్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి

సర్పంచుల సమస్యలపై పోరాటం చేయాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అపరిష్కృతంగా ఉన్న గ్రామ సర్పంచుల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మార్కాపురం మండల సర్పంచుల సంఘం నాయకులు శనివారం స్థానిక ఆర్‌అండ్‌బి బంగళా ఆవరణ వద్ద డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామ సీమలే దేశానికి పట్టుకొమ్మలని, కానీ నేడు అటువంటి గ్రామాలు సమస్యలతో కునారిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల హక్కులు కూడా హరించుకుపోతున్నాయని వాపోయారు. ఒక పార్టీ రంగు పూసుకొని సర్పంచుల సంఘ నాయకులమని మరోసారి మార్కాపురం ప్రాంతంలో తిరిగే నాయకులకు బుద్ధి చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సర్పంచ్ దయ్యాల నాథగురుబ్రహ్మం, భూపతిపల్లి సర్పంచి మున్నంగి కోటేశ్వరి లాజరు, కోలభీమునిపాడు సర్పంచ్ చిట్యాల సుబ్బారెడ్డి, ఇమ్మడి శ్రీరాములు, డి వెంకటేశ్వరరెడ్డి, కె బాలమ్మ, వి వెంకటేశ్వర్లు, గోపిరెడ్డి, శ్రీను, టి రమణమ్మ వెంకటేశ్వర్లు, నాగరాజు, సుబ్బారెడ్డి తదితర సర్పంచులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచుల సంఘం నాయకులు

CHANGE OF NAME

I, **ANEES HUSSAIN** (Old Name), S/o. (Late) AJMAL HUSSAIN, residing at D.No.2-57/2, Sayeda Street, Pedda Maseed, Pittalavani palem, Chandole, Guntur Dt, A.P. - 522311. Have Changed my name from **ANEES HUSSAIN** (Old Name) to **SHAIK ANEES HUSSAIN** (New Name). Hence forth i will be known as **SHAIK ANEES HUSSAIN** for all purposes.

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు

ఈ.పి.27/2023 ఇన్ ఓ.ఎస్.నెం.251/2019

బిట్వీన్

రాచూరి వెంకట అశోక్ ...వాది/డి.హెచ్.ఆర్

Vs

బండి నిరంజన్ ...ప్రతివాది/జె.డి.ఆర్

జె.డి.ఆర్:- బండి నిరంజన్, S/o.లాజరస్, గవర్నమెంట్ టీచర్, C/o. J.V.N.A.A.A.U.P. స్కూల్, రాజుపాలెం గ్రామం, మార్టూరు మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబర్ గల దావాలో మీరు ప్రతివాది/జె.డి.ఆర్ అయి వున్నారు. శ్రీ కోర్టు వారి నుంచి ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకముగా మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ఈ పత్రికా ప్రకటన ద్వారా పై కేసు తేది:15-12-2023వ తేదిన వాయిదా ఉన్నదని తెలియజేయడమైనది. కావున వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషములకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకోవలసినది. లేనిచో మీ పరోక్షమున వాయిదా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేది:15-12-2023

డి.వి.నాగరాజు,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది,
చిలకలూరిపేట.

హైస్కూల్ ప్లస్‌లో ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

జిల్లాలోని 16 హైస్కూల్ ప్లస్‌లలో పని చేస్తున్న సుమారు 200 మంది ఉపాధ్యాయులకు నేటికీ ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని, వెంటనే వారికి రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ సురేష్, సిఎస్ పురం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ పాదుషా, జె వెంకట్రావు డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల్లో కళాశాల ఏర్పాటు చేసి అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించకుండా అదనపు బాధ్యతలకు నియమించడం సరికాదని విమర్శించారు. వారికి వేతనంతో కూడిన ఒక ఇంక్రిమెంట్ (2,500) అదనంగా ఇస్తానని నమ్మబలికి నియామకాలు చేపట్టిన ప్రభుత్వం ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. వెంటనే తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పాత కక్షల నేపథ్యంలో..

యువకుడిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-శింగరాయకొండ

గాయపడిన శ్రీకాంత్

శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం నాడు పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడ్ని కత్తితో గొంతుపై గాయపరిచిన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే కళాశాల క్రీడా ప్రాంగణంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు యువ పరిశ్రమకు వేత్త మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కొండెపి నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుంది. శనివారం సాయంత్రం మూడు గంటల 30 నిమిషాల ప్రాంతంలో క్రికెట్ జరుగుతున్న నేపథ్యంలో. గత సంవత్సరం పసుపులేటి రవితేజ హత్య కు సంబంధించి. ఉన్న పాత కక్షల నేపథ్యంలో రవితేజ కి అత్యంత దగ్గరగా ఉన్న అతను అనుచరుడు బంధువైన కొల్ల సాయి అనే యువకుడు షరీఫ్ అనే యువకుడు ఆటోలో ఫుల్లుగా మద్యం సేవించి అక్కడ క్రికెట్ వద్ద ఉన్న మూలగుంటపాడు చెందిన మిరియం శ్రీకాంత్ అనే యువకుడ్ని గట్టిగా పట్టుకొని కత్తితో మెడపై కోసే ప్రయత్నం మొదలుపెట్టాడు. అక్కడ ఉన్నవారు అంత అప్రమత్తమై ఇద్దరిని పక్కకుతీసే ప్రయత్నం చేయగా చివరకు కొల్లా సాయి, మిరియం శ్రీకాంత్‌ను కత్తితో మెడపై కోశాడు. గతంలో రవితేజని హత్యచేసి ఇక్కడ క్రికెట్లాడుకుంటారా అంటూ హంగామా సృష్టించి ఆ తర్వాత కత్తితో దాడి చేయడంతో మిరియం శ్రీకాంత్‌ను ఒంగోలు రిమ్స్ కు తరలించారు. కొల్లా సాయి షరీఫ్ ఆటోలో కలిసి కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి పరారయిపోవడం జరిగింది. ఘటన స్థలాన్ని జరుగుమల్లి ఎస్సై వి వెంకటేశ్వరరావు శింగరాయకొండ ఏఎస్ఐ లో మహబూబ్ బాషా షేక్ బేగ్ హెడ్ కానిస్టేబుల్ లో రమణయ్య షాకీర్లు పరిశీలించి. ఘటన స్థలంలో వదిలేసి వెళ్లిన కత్తిని స్వాధీనం చేసుకొని. చుట్టుపక్కల వారిని అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాల క్రీడా ప్రాంగణంలో క్రికెట్ ఆడుతుండగా పాత కక్షలు నేపథ్యంలో కత్తులతో దాడులు చేసుకోవడంతో. క్రికెట్ ఆడుతున్న టీం మొత్తం అక్కడ నుంచి వెళ్లిపోవడం జరిగింది.

అత్యవసర ద్వారం నుంచి దిగుతున్న ప్రయాణికులు

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

18 మందికి గాయాలు

ప్రజాశక్తి-మద్దిపాడు

లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సులోని 18 మందికి గాయాలైన ఘటన మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో జరిగింది. విజయవాడ నుండి ఒంగోలుకు వెళుతున్న కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఏడుగుండ్లపాడు సమీపంలోకి వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఆగివున్న లారీని ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సులో మొత్తం 40 మంది ప్రయాణికులు ఉండగా ఈ ప్రమాదంలో 18 మందికి గాయాలయ్యాయి. నలుగురికి తీవ్రగాయాలు కాగా 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు అత్యవసర ద్వారాన్ని పగులగొట్టి ప్రయాణికులను 108 ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న కలెక్టర్ దినేష్‌కుమార్ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిజిహెచ్ అధికారులను ఆదేశించారు. జిజిహెచ్ సిఎస్ ఆర్ఎంఒ తిరుమలరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో క్షతగాత్రులకు అన్ని వైద్యపరీక్షలు నిర్వహించారు. అయితే జిజిహెచ్ అధికారులు వెళ్లిన అనంతరం వైద్యసిబ్బంది తమను సరిగా పట్టించుకోలేదని, బయటకు వెళ్లి వైద్యం చేయించుకున్నామని క్షతగాత్రులు చెప్పడం గమనార్హం.

క్రైమ్ కాలమ్

కాలువలో వృద్ధుడి మృతదేహం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

మండలంలోని చిమ్మిరిబండ గ్రామం వద్ద ఎన్ఎస్‌పి కాలువలో తేలియాడుతున్న వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు శనివారం వెలికితీశారు. ఎస్ఐ ముసలం శ్రీనివాసరావు కథనం ప్రకారం.. గుర్తు తెలియని మృతదేహం కాలువలో ఉండటాన్ని గమనించిన స్థానిక రైతులు పోలీసులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన కాలువ దగ్గరకు చేరుకున్న ఎస్ఐ గుర్తు పట్టడానికి వీలు లేని వృద్ధుడి మృతదేహాన్ని సిబ్బంది సహకారంతో బయటకు తీయించారు. మతుడిని ద్రోణాదుల గ్రామానికి చెందిన చింతల నాగేశ్వరరావు(75)గా స్థానికులు గుర్తించారు. బంధువులకు సమాచారమిచ్చారు.

పెన్షన్ డబ్బులు మేనకోడలికి ఇద్దామని

ద్రోణాదుల గ్రామానికి చెందిన చింతల నాగేశ్వరరావు గత కొంతకాలంగా వృద్ధాప్య పెన్షన్‌తో భార్య రాజేశ్వరితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తనకొచ్చే కొద్దిపాటి పింఛన్ డబ్బులను రేణింగవరం గ్రామంలో ఉంటున్న తన మేనకోడలుకు ఇవ్వడానికి ఈ నెల 4న ఇంటి నుంచి బయలుదేరి మార్గమధ్యంలో బహిర్భూమికని ఎన్ఎస్‌పి కాలువలో దిగి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతదేహం ఆరు రోజులుగా కాలువలో తేలియాడుతూ శనివారం చిమ్మిరిబండ గ్రామం వద్ద స్థానిక రైతులు గుర్తించడంతో బయటపడింది. ఏఎస్ఐ మహమ్మద్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

మండలంలోని టోల్‌ప్లాజా-తూర్పునాయుడుపాలెం మధ్యలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఒంగోలు నగరం శ్రీనగర్ కాలనీకి చెందిన శ్రీరామ రంగారావు(65) ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. రంగారావు అశుభకార్యం నిమిత్తం ఒంగోలు నుండి శింగరాయకొండ వెళ్ళి తిరిగి ఒంగోలు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రంగారావు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం స్కూటీని టోల్‌ప్లాజా సమీపంలో ఆక్వా రొయ్యల ఫ్యాక్టరీకి చెందిన లారీ రంగారావు ప్రయాణిస్తున్న స్కూటీని వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న టంగుటూరు ఎస్ఐ షేక్.ఖాదర్‌బాషా సంఘటన స్థలానికి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతుడు రంగారావు భౌతిక కాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టంగుటూరు ఎస్ఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి పెళ్లలు విరిగిపడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పొట్ట చేతపట్టుకుని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి కూలి పనికి వచ్చిన కార్మికుడు స్టోన్ క్రషర్స్ లోని రాంప్ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టి పెళ్లలు విరిగి మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మార్టూరు సమీపంలోని నాగరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ముసలం శ్రీనివాసరావు కథనం ప్రకారం. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ యాదవ్(36) భార్య పిల్లలతో కలిసి స్థానికంగా ఉన్న బాబా స్టోన్ క్రషర్స్‌లో 3 సంవత్సరాల నుంచి క్రషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పని లేకపోవడంతో శనివారం తిరిగి పనికి వచ్చిన అర్జున్ తన సోదరుడితో కలిసి క్రషర్స్ లో ఉండే రాంప్ వద్ద నిలుచొని ఉన్నాడు. ఈ క్రమంలో రాంప్ వద్ద ఒక్కసారిగా మట్టి పెళ్లలు జారీ మీద పడడంతో అందులో కూరుకుపోయాడు. ఉలిక్కిపడిన తోటి కార్మికులు దోజర్‌తో మట్టిని తొలగించి పరిశీలించగా అప్పటికే అర్జున్ మతి చెందినట్లు గుర్తించారు. క్రషర్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుతో ఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మతదేహానికి స్థానిక వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

జాన్ వెంకటయ్య మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

జాన్ వెంకటయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెద్దదోర్నాల మాజీ ఎంపిపి వేదాంత ప్రభాకర్ తండ్రి జాన్ వెంకటయ్య(80) శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి సర్పంచ్ చిత్తూరి హరిక, వైస్ సర్పంచ్ రసూల్, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, టిడిపి నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డితో పాటు పాస్టర్లు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి సంతాపం తెలిపారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎంపిడిఓ యుగకీర్తి

పథకాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-దర్శి: పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తాళ్లూరు ఎంపిడిఓ కే యుగకీర్తి అన్నారు. శనివారం వికసిత భారత్ సంకల్ప్ యాత్ర సందర్భంగా తాళ్లూరులో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ యుగకీర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు, మహిళలకు స్వావలంబన, రైతులకు రుణ మాఫీ వంటి కార్యక్రమాలు చేస్తున్నారని, వాటిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అదే విధంగా కొరపాటివారిపాలెంలో కూడా సచివాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుబ్బయ్య, ఈవోఆర్డీ రాజు, వ్యవసాయాధికారి ప్రసాద్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులు అందరిని ఆకర్షించాయి.

జాతీయ లోక్ అదాలత్‌లో 45 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. కనిగిరి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 45 కేసులు పరిష్కారం అయినట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె భరత్ చంద్ర తెలిపారు. సంవత్సరం కిందట కుటుంబ కలహాలతో కేసులు పెట్టుకొని విడిపోయిన భార్యాభర్తలు ఈ రోజు జరిగిన లోక్ అదాలత్‌లో ఇరువురు రాజీపడి ఒక్కటయ్యారు. ఈ లోక్ అదాలత్ వలన తమ కుటుంబానికి మేలు జరిగిందని, తమ సమస్యలకు పరిష్కారం చూపి కుటుంబం కలిసి ఉండేటట్లుగా చేసిన కోర్టువారికి, పోలీస్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసులు 41, సివిల్ కేసులు1, భరణం కేసులు 3 ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీమార్గంలో వెళ్లి రాజమార్గాన్ని అనుసరించాలని జడ్జి కె భరత్ చంద్ర సూచించారు. చిన్న పొరపాటు క్షణికావేశం కారణంగా గొడవలు, మనస్పర్ధలు పెట్టుకొని కేసుల దాకా వెళ్లి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కనిగిరి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది ఉన్నారు.

భర్తను చంపిన భార్య

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో భార్య భర్తను హత్య చేసిన ఘటన ఒంగోలులోని సీతారాంపురంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతనూతలపాడుకు చెందిన దర్శి మల్లిఖార్జునరావు, మద్దిరాలపాడుకు చెందిన అశ్వనికి 12ఏళ్ల కిందట వివాహమైంది. మల్లిఖార్జునరావు పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అశ్వని సంతనూతలపాడు సచివాలయం పరిధిలో వాలంటీర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. సంతనూతలపాడులో నివాసం ఉండే వీరు రెండు నెలల కిందట ఒంగోలులోని సీతారాంపురంలో అద్దెకు ఇల్లు తీసుకొని నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి మల్లిఖార్జునరావు మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మల్లిఖార్జునరావు నిద్రిస్తున్న సమయంలో అశ్వని తన చున్నీతో మల్లిఖార్జునరావు మెడకు చుట్టి హత్య చేసింది. శనివారం ఉదయం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అశ్వని లొంగిపోయింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి హత్యకు గల పూర్తి స్థాయి కారణాలను విచారిస్తున్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

ఏడుగురు జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-వెలిగండ్ల: వెలిగండ్ల మండలం నడింపల్లి గ్రామ శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను స్థానిక ఎస్ఐ మహేష్ కుమార్ శనివారం సాయంత్రం అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.3,890 నగదును స్వాధీనపరుచుకొని సోమవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

రైతుల నోరుకొట్టిన ప్రభుత్వం

- అధికార దాహంతో ప్రాజెక్టు గుల్ల
- రూ.వెయ్యి కోట్ల మేర ఇసుక దోపిడీ
- డ్యామ్ మరమ్మతులు చేపట్టాలి
- పాలకుల తీరుపై టిడిపి ధ్వజం

ప్రజాశక్తి - మద్దిపాడు

అధికార దాహంతో వైసిపి ప్రభుత్వం రైతుల నోరు కొడుతుందని, అందుకు నిదర్శనమే గుండ్లకమ్మ ప్రాజెక్టు మరో గేటు కొట్టుకుపోవడమని టిడిపి నేతలు మండిపడ్డారు. మండలంలోని మల్లవరం గుండ్లకమ్మ డ్యామ్ కొట్టుకుపోయిన రెండో గేటును టిడిపి నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టుపైన ఆధార పడిన వాళ్లను ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రాజెక్టు అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని అన్నారు. మూడో గేటు కొట్టుకుపోయి రెండేళ్లవుతున్నా ఇంత వరకు దానిని బాగుచేయలేదని అన్నారు. ఇప్పుడు కొట్టుకుపోయిన రెండో గేటును కూడా బాగుచేస్తారన్న నమ్మకం లేదన్నారు. గేట్లు పెట్టడానికి శ్రద్ధ లేదన్నారు. ఈ ప్రాంతంలో రూ.వెయ్యి కోట్ల మేర ఇసుక దోపిడి జరిగిందన్నారు. నాసిరకం మద్యం అమ్ముకోవడం, ప్రాజెక్టుల కింద ఇసుక అమ్ముకోవడం రెండే వైసిపి లక్ష్యాలని ఆరోపించారు. ఈ ప్రభుత్వాన్ని తొందరగా ఇంటికి పంపించాలన్నారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను చంద్రబాబు పరిశీలించి వారి బాధలను తెలుసుకుంటూ భరోసా ఇస్తున్నారని అన్నారు. రైతుల పక్షాన నిలబడే ఎకైక పార్టీ టిడిపి అని చెప్పారు. కొండపి

గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిశీలిస్తున్న టిడిపి నేతలు, ఎంఎల్ఎలు

ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ నోటిపారుదల మంత్రి అంబటి రాంబాబు ఎప్పుడు చంద్రబాబు నాయుడు, టిడిపి మీద బురద జల్లుతుంటారని అన్నారు. కొట్టుకుపోయిన మూడో గేటు గత నవంబర్ లోపు పెట్టిస్తామని ప్రబల్భాలు పలికి ఇంత వరకు పెట్టించలేదన్నారు. మిగతా గేట్లు రిపేర్లు కూడా పూర్తి కాలేదని మండిపడ్డారు. దీనిపై అసెంబ్లీలో కూడా లేవనెత్తామన్నారు. మెయింటెన్స్ లేకపోవడం వలన గేట్లు తుప్పు పట్టి కొట్టుకుపోతున్నాయని అన్నారు. వైసిపి నిర్లక్ష్యానికి ఇంకో గేటు కొట్టకపోయిందని అన్నారు. నీరు విడుదల చేయకపోతే మిగతా గేట్లు కొట్టుకుపోతాయని అన్నారు. గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారని అన్నారు. రైతుల ప్రయోజనాల కన్నా వైసిపి నాయకుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం, అధికారులు పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం జగన్‌కు ఉల్లి గడ్డకు, ఆలు గడ్డకు తేడా తెలియదని, రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జి మంత్రి దీనిపై స్పందించకపోవడం చూస్తుంటే వారికి రైతులపై వారికున్న చిత్తశుద్ధి అర్ధమవుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎలా పని చేస్తుందో ఈ ప్రాజెక్టును చూస్తేనే అర్థమవుతుందన్నారు. మూడో గేటు కొట్టుకుపోయినప్పుడే మిగతా గేట్లు పోయేటట్టు ఉన్నాయని చెప్పామని, ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. రైతులను కాపాడాలనే ఉద్దేశం ప్రభుత్వానికి కానీ, అధికారులకు గానీ లేదన్నారు. గిద్దలూరు టిడిపి ఇన్‌ఛార్జి ముత్తముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ వరద ప్రాంతాల్లో ఫొటో షఉట్ కోసం పర్యటిస్తున్నారని అన్నారు. నీటిపారుదల శాఖ మంత్రికి క్యూసెక్కులకు, టిఎంసికి తేడా తెలియకుండా ఉన్నాడన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండను పూర్తి చేస్తామని చెప్పి ఒక్క తట్ట మట్టి కూడా వేయలేదన్నారు. ముందుగా కొట్టుకుపోయిన గేటును పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మండవ జయంత్‌బాబు, సంతనూతలపాడు సమన్వయకర్త కందుకూరి బాబు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ క్రాపు నమోదు చేసుకోవాలంటున్న ఎఒ సుబ్బారెడ్డి

ఈ-క్రాప్ చేయించుకోండి

ప్రజాశక్తి - పంగులూరు

రబీ సీజన్లో అక్టోబర్ 10నుండి సాగుచేసిన అన్ని రకాల పంటలను ఈక్రాప్ చేయించుకోవాలని ఎఒసుబ్బారెడ్డి రైతులకు సూచించారు. తుపాను కారణంగా జె పంగులూరు మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న, శనగ, మిర్చి, పొగాకు, మినుము పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకృతి వైపరీత్యాల వలన పంట నష్టపోయిన, ఉచిత పంటల భీమా వర్తింపజేయాలన్నా, పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా, సున్నా వడ్డీ రాయితీ పొందాలన్నా తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట సాగు చేసిన రైతులు రైతు భరోసా కేంద్రాధికారులను సంప్రదించి వెంటనే పంట నమోదు చేసుకోవాలని కోరారు.

క్రీడాకారునికి ఆర్థిక సహాయం చేస్తున్న డాక్టర్ బి జవహార్

క్రీడాకారునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీమకుర్తి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకొని ఉన్నత స్థాయిలో రాణిస్తూ, దేశానికి పేరు ప్రతిష్టలు తేవాలని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్ పేర్కొన్నారు. జనవరి 14న దుబాయ్‌లో జరగునున్న ఏషియన్ డాడ్జ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో అండర్ 16బాలుర విభాగంలో పాల్గొనేందుకు స్థానిక నారాయణ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి ఎం విశ్వసాయి ఎంపికయ్యాడు. అయితే దుబాయ్ వెళ్ళి వచ్చేయందుకు ప్రయాణ ఖర్చులు, క్రీడావస్తువులకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. లయన్స్‌క్లబ్ వారని సంప్రదించగా స్పందించిన డాక్టర్ బి జవహర్, లయన్స్ డైరెక్టర్ చలువాది బదరి నారాయణ రు.20వేలు సంయుక్తంగా సమకూర్చారు. జవహర్ హెూం ఆసుపత్రిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థి విశ్వసాయికి రు.20వేలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ చలువాది రమేష్, పాఠశాల పిడి ఎం సుబ్బారావు, వై రామకృష్ణ, పి రవికుమార్, ఎం సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ జవహార్

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - చీమకుర్తి

స్థానిక మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులకు, వితంతువులకు వైఎస్ భారతి సేవా సమితి అధ్యక్షురాలు పాటిబండ్ల రాజసులోచన ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. స్థానిక జవహర్ నర్సింగ్‌హెూమ్‌లో వైఎస్ భారతి పుట్టినరోజు సంధర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బి జవహర్, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీ నారాయణ మాట్లాడుతూ పేద మహిళలు, వితంతువులకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, బుట్టి సాల్మన్, జె నాగభూషణం పాల్గొన్నారు.

తుపాను బాధితులకు
రేషన్, రూ.2500 పంపిణీ చేయాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్

ప్రజాశక్తి-రేపల్లె :

జగనన్నకాలనీలో వర్షంనీళ్ల మధ్యలో నివాసం ఉంటున్న పేదలకు సిఎం ప్రకటించిన విధంగా రూ.2500నగదు, 25కేజీల బియ్యం, కందిపప్పు, ఆయిల్, బంగాళదుంపలు పంపిణీ చేయాలనీ సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. పట్టణంలో వందల సంఖ్యలో పేదలు జగనన్న కాలనీలో తుఫాను వల్ల నేటికీ వర్షంనీటిలో ఉంటున్నారని అన్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నష్టపరిహారం అందిం చడంలో విఫలమయ్యారని అనారు. జగనన్న కాలనీలో రోడ్లు లేకపోవడంతో మోకాళ్ళ లోతు వర్షం నీళ్లలో నడుస్తున్నారని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షం నీళ్లను మోటర్లుతోనైనా తోడే ప్రయత్నం చేయలేదని అన్నారు. దోమలు స్వైర విహారం చేస్తున్నాయని అన్నారు. తాగటానికి మంచినీళ్లు కూడా లేవని అన్నారు. ఇన్ని సమస్యల మధ్య ఉన్న పేదలను పట్టించుకోవడంలో, తుఫాను పరిహారం అందించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపించాలని కోరారు. సిఎం జగన్ జిల్లా పర్యటన సందర్భంగా పునరావస కేంద్రాలకు వచ్చిన వారికే కాకుండా వర్షం నీళ్ల

నీట మునిగిన జగనన్న కాలనీ పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

మధ్యలో ఉన్న పేదలకు రూ.2500 చొప్పున ఇంటింటికి తిరిగి అందించాలని ప్రకటన చేశారని గుర్తు చేశారు. కానీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు లేవని చెప్తున్నారు. సిఎం ప్రకటించిన పద్ధతుల్లో ఇప్పటికీ వర్షం నీటిలో నివాసం ఉంటున్న పేదలందరికీ ఆర్థికసహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి శ్రీనివాస రావు, ఆవీర్వాదం, కె వెంకట్రావు, స్థానిక మహిళలు కె నాంచారమ్మ, సుబ్బారావు, అనూష పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి ప్రాంత అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ శివనగర్ కాలనీలో మన ఊరు మన ఉగ్ర, భవిష్యత్తుకు గ్యారెంటీ బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని ఆయన శనివారం రాత్రి నిర్వహించారు. ఇంటింటికి కుళాయిల ద్వారా సురక్షిత జలాలు అందిస్తానని, ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలం తో పాటు పక్కా గృహాలను మంజూరు చేయిస్తానని డాక్టర్ ఉగ్ర తెలియజేశారు. వెనుకబడిన కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని గెలిపించడం మీ వంతు అభివృద్ధి చేసి చూపించడం నా వంతు అని ఆయన తెలిపారు. వెనుకబడిన కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా తెలుగుదేశం జెండా కనిగిరి పై రెపరెపలాడాలని అది మీ చేతుల్లో ఉందని అన్నారు. గతంలో చేసిన కంటే పది రెట్లు ఎక్కువ అభివృద్ధి చేసి కనిగిరిని కనకగిరిగా మార్చేందుకు కృషి చేస్తానని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, వి వి ఆర్ మనోహర్రావు, చింతలపూడి తిరుపాలు, పచ్చవ చంద్రశేఖర్ , పాలూరి సత్యం, ఈదర రవికుమార్, కనిగిరి మనోహర్రావు, ఉదయగిరి బాల చెన్నయ్య పాల్గొన్నారు.

తిరుగులేని శక్తిగా ఎల్ఐసి

ఎల్ఐసి ఉద్యోగుల మహాసభలో వేణుగోపాల్

ప్రజాశక్తి - బాపట్ల

కోట్లాది మంది పాలసీదారుల నమ్మకం, ఆదరణ వల్లే జాతీయీకరణ నాటి అద్భుత ప్రగతి సాధిస్తూ ప్రస్తుత బీమా మార్కెట్లో ఎల్ఐసి తిరుగు లేని శక్తిగా నిలిచిందని ఆల్ ఇండియా ఇన్సురెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి కె వేణగోపాల్ అన్నారు. ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ 55వ మహాసభలు పట్టణంలో శనివారం నిర్వహించారు. మహాసభలకు డివిజన్ అధ్యక్షులు జె సుధాకర్ అధ్యక్షత వహించారు. సభలో వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆర్థిక, సరళీకరణ విధానాలను వేగవంతం చేస్తూ ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను ఆచరిస్తోందని అన్నారు. కీలకమైన రైల్వే, బ్యాంకింగ్, రక్షణ రంగం ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. వాటినీ అమ్మేయాలని ఆలోచించడం దేశ ప్రయోజనాలకు హానికర మని

ఎల్ఐసి మహాసభలో మాట్లాడుతున్న కె వేణుగోపాల్

అన్నారు. త్యాగంతో, పోరాటాలతో విశాఖ ఉక్కు పరిశ్రమను తెలుగు ప్రజలు సాధించుకున్నారని అన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు ప్రజలు సుదీర్ఘ కాలం నుండి ఉద్యమాలు నడిపించడం అభినందనీయని అన్నారు. సభలో ఆహ్వాన సంఘం ఛైర్మన్, ఎంఎల్ఎ కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల ప్రాంతం చారిత్రక ప్రాధాన్యతను, విశిష్టతను వివరించారు. దేశ విస్తృత ప్రయోజనాల కోసం ఎల్ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు మరింత శక్తి వంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్య విధానాలు వల్ల ఎదురవుతున్న అన్ని రకాలు సవాళ్లను ఎల్ఐసి ఉద్యోగులు, అధికారులు, ఏజంట్లు కలిసికట్టుగా ఎదుర్కోవాలని అన్నారు. జోనల్ సంయుక్త కార్యదర్శి జి తిరుపతయ్య మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన కార్మిక సంఘాల ఉనికిని దెబ్బతీసేందుకు ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. తొలుత మచిలీపట్నం టివిజన్ పరిధిలోని 5 జిల్లాల నుండి హాజరైన ఎల్ఐసి ఉద్యోగులు ప్లకార్డులు, బ్యానర్లు, యూనియన్ జెండాలతో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సభలో డివిజన్ ప్రధాన కార్యదర్శి జి కిశోర్ కుమార్, ఎంవి కోటేశ్వరబాబు, ఎం నగేష్, కె బుల్లయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, డి శ్రీనివాసరావు, వరబాబు, వై గాంధీ, రామమోహనరావు, ఎంఎన్ పాత్రుడు, ఎల్ఐసి బ్రాంచి మేనెజర్ జి గోపాలరావు, కన్వీనర్ కె భాస్కరావు, కో కన్వీనర్ కె రవికిరణ్ పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీదేవి దుంపా

మాతృత్వ సురక్ష గర్భిణులకు రక్ష

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెంలో గల ప్రభుత్వ వైద్యశాలలో శనివారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా 9వ తేదీ రోజున గర్భిణులను పరీక్షించి మందులు అందిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం అందజేశారు. అనంతరం డాక్టర్ శ్రీదేవి దుంపా సహాయ సహకారాలతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 400 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. చికిత్సలు అందించి ఐరన్, క్యాల్షియం టానిక్‌లు, ప్రొటీన్ పౌడర్లు అందజేశారు. దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి దుంపా గర్భిణులకు ఆరోగ్య విద్యను బోధించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం శ్రీనివాసరావు, వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ కోటా నాయక్, సయ్యద్ నాయబ్ రసూల్, సూపర్‌వైజర్ పిసిహెచ్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పిల్లి ఆవులయ్య, నలగాటి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

- బోగస్ ఓట్లతో ఎన్నికల్లో నెగ్గేందుకు వైసిపి కుట్ర
- ఓట్ల తొలగింపులో అధికారుల ఏకపక్షం
- మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపి ప్రభుత్వంలో ప్రజలు విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని తెలుగుదేశం పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో మోసపు ఓట్లతో నెగ్గాలని వైసిపి చూస్తోందని ఆరోపించారు. అందుకు కొందరు అధికారులు అధికార వైసిపికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందుల నారాయణరెడ్డి మాట్లాడారు. మార్కాపురం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం వైసిపి పడరాని పాట్లు పడుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీల ఓట్లు తొలగించే పనిలో నిమగ్నమయ్యారన్నారు. కొందరు అధికారులు అందుకు సహకరిస్తున్నారన్నారు. ఓట్లను తొలగించే ముందు ఎలాంటి విచారణా చేయడం లేదన్నారు. వలస కూలీల ఓట్లు గల్లంతవుతున్నాయన్నారు. అర్హత కలిగిన వారికి ఓట్లు ఉండేలా చూడాలని కోరారు. వైసిపికి అనుకూలమైతే ఓట్లు ఉంచడం... లేకపోతే తొలగించాలనుకోవడం సరికాదన్నారు. ఆ విధంగా అధికారులు కొందరు వ్యవహరిస్తున్నారని, అలాంటి వారందరినీ గుర్తుంచుకుంటామని హెచ్చరించారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. తుపాను కారణంగా రైతన్నలు తీరని నష్టానికి గురయ్యారన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం హెలికాప్టర్‌లో వచ్చి వెళితే ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో రైతన్నలు దెబ్బతిన్న వివరాలు సేకరించాలన్నారు. ప్రతి రైతన్నకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. రైతులకు ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని తాము అనుకోవడం లేదన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు 5వ గేటు గతంలో కొట్టుకుపోయిందన్నారు. దాని మరమ్మతులు ఇంకా జరుగుతూనే ఉన్నాయన్నారు. తాజాగా 3వ గేటు కొట్టుకుపోయిందన్నారు. ఈ విధంగా నీరు సముద్రం పాలవుతోందన్నారు. ఆ ప్రాంత రైతాంగాన్ని గుండ్లకమ్మ ప్రాజెక్టు ద్వారా ఒరిగిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తేనే రైతన్నలతో పాటు అందరూ బాగుంటారని చెప్పారు. విలేకరుల సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, టిడిపి ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, టిడిపి నాయకులు సయ్యద్ గఫార్, పఠాన్ గులాబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న పీసీసీ సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి

సోనియా ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం

ప్రజాశక్తి-కనిగిరి

ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 77వ జన్మదినోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, పిసిసి సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని సూరా పాపిరెడ్డి కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఆయన కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మాజీ ప్రధాని కోడలు మరియొక ప్రధాని భార్య ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు అయిన సోనియాగాంధీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చేందుకు యువ నాయకుడు రాహుల్ గాంధీ విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో వలె ఆంధ్రాలో కూడా ప్రజల ఆకాంక్ష నెరవేరేలా ప్రజా సంక్షేమం కోరే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఆయన పేర్కొన్నారు. సోనియాగాంధీ మాట ఇచ్చారంటే తప్పక నెరవేరుస్తారని, ప్రజల కష్టాలు తీరుస్తారని తెలిపారు. సోనియా సారథ్యంలో దేశం సుభిక్షంగా అభివృద్ధి వైపు అడుగులు ముందుకు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు సంగటి మల్లికార్జునరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బలసాని కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు రమణయ్య, కాంగ్రెస్ పార్టీ శ్రేయోభిలాషులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ 76వ జన్మదిన వేడుకలను ఏపీసిసి సభ్యులు, యర్రగొండపాలెం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంటయ్య, షేక్ కాశింవలి, బి వెంకటయ్య, వెంకటరామయ్య, టి అచ్యుతరావు, షేక్ వలి, మంత్రునాయక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్‌లో..

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని హనుమాన్ జంక్షన్ (కుంట) కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ 76వ జన్మదినోత్సవాన్ని పెద్దారవీడు కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కొటారు కొండయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో కొటారు కొండయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో పేద, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు సొంటి శ్రీనివాసరెడ్డి, కొలబర్ల మోషెబాబు, మాజీ సర్పంచ్ ఉప్పలపాటి చిన్నకాశయ్య, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా..

సరస్వతి విద్యాసంస్థల అధినేత ఆవుల వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి-దర్శి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దర్శి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా తాళ్లూరులోని సరస్వతి విద్యాసంస్థల అధినేత ఆవుల వెంకటరమణారెడ్డి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఐదు మండలాల్లో పరిచయాలు కలిగి ఉన్నందున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దర్శి నియోజకవర్గంలో దర్శితో పాటు తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ మండలాలు ఉన్నాయి. రమణారెడ్డి గత 30సంవత్సరాలకు పైగా విద్యాసంస్థలను నడుపుతూ అన్ని మండలాల్లో వేలాది మంది విద్యార్థులను తయారు చేశారు. ఆ సంస్థలో చదివిన వారు ఎంతో మంది ఇతర దేశాల్లో స్థిరపడి ఉన్నతంగా ఎదిగారు. డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రముఖులుగా కూడా చాలా మంది ఉన్నారు. రమణారెడ్డికి ఉన్న పరిచయాలు, బంధుత్వంతో పాటు బలమైన సామాజిక వర్గంగా ఉండటంతో 2009లోనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీకి టికెట్ కావాలని అప్పట్లో ప్రయత్నాలు చేశారు. అయితే ప్రస్తుతం 2024 ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేయాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఆయనకు పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల్లో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి నాయకులతో పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఆయన అభ్యర్థిత్వాన్ని పరిగణలోకి తీసుకుని టికెట్ కేటాయిస్తే గెలుపు సునాయాసంగా ఉంటుందని అంటున్నారు. ఆయన ఒంగోలులో కూడా ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారు. వాటిలో వేలాది మంది విద్యార్థులు ఆ కళాశాలల్లో చదువుకుంటున్నారు. ఆ కళాశాలలో ఆయన ఇద్దరు కుమారులు మేనేజ్‌మెంట్ నిర్వాహణలో ఉన్నారు. ప్రస్తుతం రమణారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు తనను పరిగణలోకి తీసుకుని ఏ పార్టీ అయినా అవకాశం ఇస్తే తప్పకుండా 2024 ఎన్నికల్లో దర్శి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో దర్శి నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రత్యేకమైన గుర్తింపు పొందింది. ఇక్కడ పోటీ చేసే వారు పారిశ్రామికవేత్తలు కావడంతో ఈ గుర్తింపు వచ్చింది. ఈ నేపథ్యంలో రమణారెడ్డి తనకున్న అంగబలం, ఆర్థిక బలంలో కూడా ప్రత్యర్థులతో ఈ నియోజకవర్గంలో పోటీకి సరితూగుతారని ఆయన అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి అధినేతతో 'ముత్తుముల' భేటీ

చంద్రబాబును కలిసిన టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల, జడ్పీటీసీ బుడతా మధుసూదన్ యాదవ్

ప్రజాశక్తి-గిద్దలూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని గిద్దలూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిశారు. మిచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు బాపట్ల పార్లమెంట్‌లో పర్యటిస్తున్న చంద్రబాబుని జడ్పీటీసీ బుడతా మధుసూదన్ యాదవ్, మాజీ సర్పంచ్ చెన్నుబోయిన రామకృష్ణ యాదవ్‌లతో సహా ముత్తుముల అశోక్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలపై ఆయన చర్చించారు. జగన్ అరాచక పాలనను వ్యతిరేకిస్తూ వైసీపీని వీడి టీడీపీలో చేరిన జడ్పీటీసీ, మాజీ సర్పంచ్‌లను ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు. వారికి రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. నియోజకవర్గంలో అశోక్ రెడ్డి గెలుపు కోసం కష్టపడి పని చేయాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కావటం ఖాయమని అన్నారు.

కనిగిరిలో పసుపు జెండా ఎగరేస్తాం: ఉగ్ర

చంద్రబాబుతో ఇన్‌ఛార్జుల సమావేశంలో డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

బాపట్ల జిల్లా పర్చూరు పర్యటనలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుతో ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి నేతలతో కలిసి కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శనివారం సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చంద్రబాబు చర్చించారు. కనిగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా రెపరెపలాడేలా అవిశ్రాంతంగా కృషి చేస్తున్నట్లు డాక్టర్ ఉగ్ర చంద్రబాబుకు తెలియజేశారు. మన ఊరు -మన ఉగ్ర, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ప్రతి గడపకు వెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వివరిస్తున్నట్లు చంద్రబాబు నాయుడుకు డాక్టర్ ఉగ్ర వివరించారు. చంద్రబాబు నాయుడు డాక్టర్ ఉగ్రను అభినందించారు.

వికలాంగులు ఐకమత్యంతో మెలగాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: వికలాంగులు ఐకమత్యంతో మెలగాలని, కలిసికట్టుగా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య కోరారు. శనివారం ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఏరియా టీమ్ లీడర్ గిరిజ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో 64వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం జరిగింది. ఏటిఎల్ గిరిజ మాట్లాడుతూ ప్రతిభావంతులకు ఆర్డీటీ సేవలను వివరించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీటీ అధికారులు జులేఖ, సుధీర్, అంధ ఉద్యోగుల సంఘం బూదాల చిన్నయ్య, విహెచ్‌పిఎస్ పి పెద్ద పాలంకయ్య, కే కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి

విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి: జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ కైపు వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. శనివారం తాళ్లూరులోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వంలో సోనియా ఆధ్వర్యంలో చేసిన మేలును గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, పద్మ దంపతుల చిన్న కుమారుడు లక్ష్మణ్‌కుమార్, త్రినూషల వివాహం సందర్భంగా శనివారం మైనంపాడులో జరిగిన రిసెప్షన్‌కు హాజరై వధూవరులను ఆశీర్వదించిన సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, బంధుమిత్రులు

\- ప్రజాశక్తి-సంతనూతలపాడు

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

ప్రజాశక్తి - రేపల్లె

విలేకర్ల సమావేశంలో ఎంపి మోపిదేవి వెంకటరమణ

రైతులు అధైర్యపడొద్దని, ప్రభుతం అండగా ఉందని రాజ్యసభ సభ్యులు మోపి దేవి వెంకట రామారావు అన్నారు. తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు పక్షపాతిగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రైతులను ఆదుకునేందుకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రైతులకు పంట నష్టం జరిగితే గిట్టుబాటు ధర కల్పించారని గుర్తుచేశారు. నాలుగు రోజుల క్రితం తుఫాను సృష్టించిన విలయానికి జిల్లాలో చాలా ప్రాంతాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని అన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో సిఎం వైఎస్ జగన్ స్పందించి జిల్లా యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారని చెప్పారు. పంట నష్టం జరిగిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగానే సిఎం జిల్లా పర్యటన చేశారని చెప్పారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు అన్నారు. 2014-15లో సంభవించిన హుదూద్, తిత్లి తుఫానుల్లో పంట నష్టం జరిగిన రైతులకు చంద్రబాబు ఏ మేరకు న్యాయం చేశారో చెప్పాలని అన్నారు. ఇన్పుట్ సబ్సిడీ రూ.960కోట్లు పెండింగ్ పెట్టారని, విత్తన బకాయి రూ.230కోట్లు, సున్నా వడ్డీ రూ.1200కోట్లు చంద్రబాబు బకాయిలు పెట్టారని అన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న 474మంది రైతులకు ఇవ్వాల్సిన పరిహారం రూ.24కోట్లు, తిత్లి తుఫాను పంట నష్టం రూ.200కోట్లు, ఇలా మొత్తం రూ.6వేల కోట్ల పెండింగ్ బకాయిలను జగన్మోహన్ రెడ్డి తీర్చారని వివరించారు. రూ.74వేల కోట్ల తో రైతుల పంట రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంకు వచ్చాక కేవలం రూ.1200 కోట్లు మాఫీ చేశారని అన్నారు. రైతన్నను మోసం చేసిన ఘనత చంద్రబాబుదని ఆరోపించారు. తుఫానులో పంట నష్టం జరిగితే అది ప్రభుత్వ వైఫల్యం అని, తాను అధికారంలోకి వచ్చాక రైతులను ఆదుకుం టామని మరోసారి రైతులను మోసగించేందుకు పర్యటిస్తున్నారని అన్నారు. చిత్తశుద్ధి, అంకితభావంతో రైతులకు జరిగిన నష్టం ప్రతి రూపాయి చెల్లిస్తామని సీఎం స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. దేవాదాయ, ఈనాం, ప్రభుత్వ భూములు, కౌలు రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - చీరాల

సంక్షేమ పథకాల బ్రోచర్లు అందిస్తున్న నేతలు

మండలంలోని కావూరివారి పాలెం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ 'జగన్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలో వైసిపీ జెండా ఆవిష్కరణ చేశారు. గడిచిన నాలుగున్నరేళ్లలో సచివాలయం పరిధిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలతో కూడిన బ్రోచర్లు ఇంటింటికీ తిరిగి అందజేశారు. వైసిపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసిపీ చీరాల మండలం అధ్యక్షులు ఆసాది అంకాల రెడ్డి, జేసీఎస్ మండల ఇంచార్జ్ బుర్ల సాంబశివరావు, వైసిపీ జిల్లా కార్యదర్శి బండారు శివ పార్వతి, పిఎసిఎస్ చైర్మన్ బోయిన కేశవులు, మాజీ వైస్ ఎంపిపి నాదెండ్ల కోటేశ్వరరావు, పాలిబోయిన పెద్ద అంకిరెడ్డి, కావూరి యదలరెడ్డి, బుర్ల మురళీకృష్ణ, పృధ్వి ధనుంజయ, గుంటూరు వెంకట సుబ్బారావు, శీలం వేంకటేశ్వరమ్మ, కోటి రవి, పర్వతనేని శ్రీనివాసరావు, పిట్టు పోలయ్య, షేక్ మస్తాన్, దరబడి సురేష్, భోగిరెడ్డి సుబ్బారెడ్డి, చప్పిడి రామచంద్రరావు, దుడ్డు మార్క్, గవిని కోటేశ్వరరావు, దబ్బకూటి శ్రీనివాసరావు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : జగనన్నే ఎందుకు సర్వేలు వెంటనే పూర్తి చేయాలని జెడ్‌పి సిఇఒ జాలిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు సంక్షేమ పదకాలు అభివద్ధిపై శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా జాలిరెడ్డి మాట్లాడుతూ సర్వేలు మందకొడిగా సాగుతున్నాయని, వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆడూదాం ఆంధ్ర రిజస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్య పనులపై తగిన శ్రద్ధచూపాలన్నారు. ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పదకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ డి జయమణి, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తుపానుకు తడిసిన పుస్తకాల పరిశీలన

ప్రజాశక్తి - కొల్లూరు

పుస్తకాలు అందజేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

మండలంలోని తోకలవాని పాలెం గ్రామంలో తుపాను కారణంగా ఇంటిలోనికి నీరు వచ్చి తడిసిపోయిన పుస్తకాలను, ఇళ్లను ఏపీ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం పరిశీలిం చారు. గ్రామంలో విద్యార్థులైన కంచర్ల సాయి, కంచర్ల కృష్ణ చైతన్య అనే విద్యార్థులతో మాట్లాడారు. వారికి కొత్త పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ టి కృష్ణమోహన్ గ్రామంలోని యుపి స్కూల్‌కు నాడు - నేడు కింద రూ.11లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అయితే వాటిలో కేవలం రూ.3.50లక్షలు మాత్రమే విడుదల చేశారని, వాటిని ఖర్చు చేశామని తెలిపారు. మిగిలిన పని అసంపూర్తిగా మిగిలిపోయిందని తెలిపారు. మిగిలిన రూ.7.50 లక్షల నిధులు వెంటనే విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు.. కార్యక్రమంలో ఎంఈఓ వివిఎస్ జ్యోతి, వేమూరు ఎంఈఓ వెంకటేశ్వర రావు, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పేద విద్యార్థుల నివసించే పూరి గుడి సెలలో పాఠ్యపుస్తకాలు తడిచి పోయాయనే సమాచారంతో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం పరిశీ లించారు. వేమూరు మండలం లోని కుచ్చెర్లపాడు, కొల్లూరు మండలం తోకలవాని పాలెం, భట్టిప్రోలు మండలం ఆళ్ళమూడి గ్రామాల్లో ఆయన పాఠశాల విద్యార్థుల స్థితిగతులు తెలుసుకు న్నారు. విద్యార్థులకు నూతన పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాల విద్యపై వాకాబు చేశారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు ఎంఇఒలు ఐ వెంకటేశ్వరరావు, నీలం దేవరాజ్, పులి లాజర్, ఆళ్లమూడి సర్పంచ్ రాంబాబు, తోకలవానిపాలెం సర్పంచి టి కృష్ణమోహన్ ఉన్నారు.

విద్యార్థులకు దుస్తులు, నిత్యావసరాలు అందిస్తున్న అమర్నాథ్

విద్యార్థులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి- సంతమాగులూరు

చదువు ద్వారానే సామాజిక మార్పు వస్తుందని, నేటి పోటీ ప్రపంచంలో విద్య అవసరం ఎంతైనా ఉందని కార్డ్ సంస్థ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ టి అమర్నాథ్ అన్నారు. మండలంలోని ఏల్చూరు గ్రామ జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో చదువుకు దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినీ, విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే బలహీన వర్గాల విద్యార్థులు 25మందిని గుర్తించి దుస్తులు, నిత్యవసర వస్తువులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డ్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఫ్రాంక్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ, చత్తీస్‌ఘడ్, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల్లో 7వేల బాల బారతి సెంటర్ల ద్వారా ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లాలో 320సెంటర్లు, రెండు మండలాలకు ఒక కోఆర్డినేటర్ ద్వారా బాల భారతి సెంటర్లు నడుస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ల ద్వారా బడి మానేసిన పిల్లలను చదువుకునేందుకు ప్రోత్సహించటం, వారికి గురుకుల పాఠశాలలో ప్రవేశం కొరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్డ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఉప సర్పంచి కుంచాల నాగేశ్వరరావు, సంస్థ మండల కోఆర్డినేటర్ కె ప్రమీల, మాజీ ఆర్‌సిఒ టి జార్జి పాల్గొన్నారు.

భీమా చెక్కు అందజేస్తున్న పోస్టల్ ఎస్‌పి శ్రీనివాసులు

రూ.399కే పోస్టల్ ప్రమాద బీమా

ప్రజాశక్తి - పొదిలి

కేవలం రూ.399లకే గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీని అందిస్తున్నట్లు మార్కాపురం పోస్టల్ ఎస్పీ కె శ్రీనివాసులు తెలిపారు. స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక డ్రైవ్‌లో ఆయన మాట్లాడుతూ ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు నుండి ఈ పాలసీని రూపొందించినట్లు తెలిపారు. దీని ద్వారా అసంఘటిత రంగంలోని కార్మికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అనుకోని ప్రమాద సంఘటన జరిగితే కేవలం రూ.399లకే బాధిత కుటుంబానికి రూ.10లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నామని అన్నారు. బాధితులకు శాశ్విత లేదా పాక్షిక వైకల్యానికి, ప్రమాద సమయంలో పాక్షిక అంగచ్ఛేదనం, పక్షవాతానికి కూడా రూ.10లక్షల కవరేజ్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరు ఉపయోగించు కోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రమాదంలో మరణించిన కుటుంబానికి రూ.10లక్షల విలువైన చెక్కును కుటుంబ సభ్యులు అందించారు. కార్యక్రమంలో పోస్టల్ మేనేజర్ నాగేశ్వరరావు, ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, డివిజనల్ ఇన్స్ట్రక్టర్ విజయ్‌కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు జరిమానా

ప్రజాశక్తి - పొదిలి

పొదిలి - కనిగిరి రోడ్డులో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఐదు ఆటోలపై కేసులు నమోదు చేసి రూ.30వేలు జరిమానా విధించినట్లు దర్శి మోటారు వాహనాల తనిఖీ అధికారి పి రవికుమార్ తెలిపారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వాహన చోధకులు సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి రాష్ డ్రైవింగ్ చేసి వాహనలూ నడిపినచో వాటికి సంభందించిన ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్‌లు రద్దుచేస్తామని అన్నారు. వాహనాలు నడిపే వారికీ డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. చోధకులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య తీర్చాలి

ప్రజాశక్తి - చీమకుర్తి

వినతి పత్రం అందజేస్తున్న నేతలు

గొర్రెలు, మేకలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని,ప్రతి గ్రామంలో బోర్లు వేసి నీటి తొట్లు కట్టించాలని కోరుతూ ఏపి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు వినతి పత్రం శనివారం అందజేశారు. స్థానిక బూచేపల్లి నివాసంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లాలో మార్కాపురం, కనిగిరి, యర్రగొం డపాలెం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాలలో గొర్రెలకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కానీ, జిల్లా పరిషత్ ద్వారా గానీ ప్రత్యేక నిధులు కేటాయించి ప్రతి గ్రామంలో బోర్లు వేసి తొట్లు కట్టించి, దాహార్తి తీర్చాలని కోరారు. ఈ విషయంపై బూచేపల్లి వెంకాయమ్మ స్పందించి మాట్లాడుతూ జిల్లా పరిషత్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, సహాయ కార్యదర్శి ఖండే బాలక్రిష్ణ, జిల్లా అధ్యక్షులు బొడ్డురామారావు, గౌరవాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్య, జిల్లా నాయకులు రావెళ్ళ వెంకటరావు, నక్క గంగరాజు, తాళ్ళూరి శ్రీనివాసరావు, బి శివయ్య పాల్గొన్నారు.

చీమకుర్తిలో ఘనంగా నగరోత్సవం

ప్రజాశక్తి - చీమకుర్తి

నగరోత్సవంలో శిద్దా దంపతులు

అయ్యప్పస్వామి నగరోత్సవం మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతులు, టిటిడి డైరక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు, శిద్దా పాండురంగారావు, సుధావళి దంపతులు, శిద్దా సుధాకర్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహా గణపతి పూజ, నవగ్రహ పూజ, యజ్ఞ యాగాదులు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి నగరోత్సవం పట్టణంలో నిర్వహించారు. పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపును శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు లాంఛనంగా ప్రారంభించారు. నగరోత్సవానికి చిన్నారులతో జ్యోతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సంధర్భంగా అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర ప్రసాదు, మహిళలు, వందలాది స్వాములు పాల్గొన్నారు.

ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ సుధాకర్

నీరు వృథా కాకుండా చూడాలి

ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు

ప్రజాశక్తి - మద్దిపాడు

ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డ్యాంలోని నీరు వృథా కాకుండా చూడాలని ఇంజ నీరింగ్ అధికారు లను ఎమ్మెల్యే టీజర్ సుధాకర్ బాబు ఆదేశించారు. మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడంతో గుండ్లకమ్మను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ఎగువ నుండి ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరిందన్నారు. గేట్లను పరిశీలించి తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రాజెక్టు నీరు వధా కాకుండా చూడాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలు రైతులు నమ్మవద్దన్నారు. రూ.9కోట్ల నిధులు ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులకు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంజూరు చేసారని రైతులు ఆందోళన చెందకుండా ఉండాలనీ అన్నారు. రబీ పంటలకు ఎటువంటి డొకా ఉండదనితెలిపారు.

విలేకర్ల సమావేశంలో ఎంఎల్ఎ కోన రఘుపతి

నల్లమడ డ్రైనేజీ ఆధునీకీకరణ

ప్రజాశక్తి - బాపట్ల

నల్లమడ డ్రైనేజీ ఆధునికరణ వైసిపి ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందని ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. తన ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లమడ డ్రైన్కు గతంలో వరదలు వచ్చినపుడు చంద్రబాబు పర్యటనకు వచ్చి రూ.550కోట్లుతో ఆధునీకీకరణ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కనీసం రూ.కోటి కూడా విడుదల చేయకుండా రూ.30 లక్షలతో తూతూ మంత్రంగా పనులు చేశారని ఆరోపించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక నల్లమడ డ్రైనేజీ ఆధునీకీకరణ చేసేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కరోనా విపత్తు రావటంతో ప్రాధాన్యతలు మారి పోయినట్లు చెప్పారు. వైసిపి మళ్లీ అధికారంలోకి రావటం తథ్యమని, నల్లమడలోని ఏడు చోట్ల ఉన్న పంపులను సరిచేసి, పూడికతీత పనులు చేపడతామని తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం సరైన చర్య కాదు

ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సరైన చర్య కాదని ఎంఎల్ఎ కోన రఘుపతి పేర్కొన్నారు. భర్తీపూడిలో ఎన్టీఆర్ విగ్రహం తలవిరగొట్టినవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. ఎన్టీఆర్పై అందరికి ప్రేమాభిమానాలు ఉన్నాయని తెలిపారు. ఎన్టీఆర్ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఎక్కడలేని ప్రేమ ప్రదర్శిస్తున్నారని చెప్పారు. సమావేశంలో వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి, ఎఎంసి మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి, జోగి రాజా, గొర్రెముచ్చు వెంకటేశ్వర్లు, అక్కిరెడ్డి, మండే విజయ్ కుమార్ పాల్గొన్నారు.

తెలుగు మహాసభలకు పేరిరెడ్డి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి

అంతర్జాతీయ 2వ తెలుగు మహాసభలు 2024జనవరిలో జరగనున్నాయి. సభలకు బాపట్ల జిల్లా ఉత్సవ కమిటీ సంచాలకులుగా మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డిని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ నియమించారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థలు సంయుక్తంగా తెలుగు మహాసభలు 2024 జనవరి 5, 6, 7తేదీల్లో రాజమహేంద్ర వరంలోని గోదావరి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం జరిగనున్నాయి. 14మందితో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. తెలుగుజాతి సాహితీ, సాంస్కృతిక, ఆత్మగౌరవం, ఆంధ్ర వైభవ స్వాభిమాన చిహ్నం ఆంధ్ర సారస్వత పరిషత్ సంస్థ, ఆంధ్రమేవ జయతే అన్న నినాదంతో తెలుగు భాష వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెద్ద ఎత్తున అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించాలని సంకల్పం చేసినట్లు తెలిపారు. ఆదికవి నన్నయ వేదికపై తెలుగు భాషలోని 25ప్రక్రియలపై సదస్సులు, కవి నారాయణ భట్టు వేదికపై నిర్వహించే కవి సమ్మేళనంలో కవిత, గేయం, పద్యం, హైకూ, నానీలు, తెలుగు గజల్, తెలుగు రూబాయి, కథా పఠనాలకు అవకాశం కలిగిస్తున్నారని తెలిపారు. అదే సందర్భంలో నూతన గ్రంధావిష్కరణలు జరుగుతాయని తెలిపారు. శ్రీరాజ నరేంద్ర వేదికపై హరికథ, బుర్రకథ, యక్షగానం, అవధానం, పౌరాణిక నాటకం, సాంఘిక నాటకం, వాగ్గేయకార సంగీతం, లలిత చలనచిత్ర, జానపద సంగీతం, ఆంధ్ర నాట్యం, కూచిపూడి నృత్యాలు, సంచార జాతుల కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారని తెలిపారు. వేలాది మంది తెలుగు భాష అభివృద్ధి, ఆంధ్రమేవ జయతే వైభవ శోభాయాత్ర జరుగుతుందని అన్నారు. 10వేల మంది బాలబాలికలతో, యువతతో తెలుగు వైభవంపై కళా ప్రదర్శన జరుగుతుందని అన్నారు. పుస్తక ప్రదర్శనలు, కేంద్ర సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్, విశాలాంధ్ర గ్రంథాల ప్రత్యేక ప్రదర్శన కూడా ఏర్పాటు చేస్తారని పేరిరెడ్డి వివరించారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే పంట నష్టం

ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

ప్రభుత్వ వైఫల్యం కారణంగా పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందని ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. పంట నష్టం పోయిన రైతుల్లో మనోధైర్యం నింపి, వారి కష్టాలు తెలుసుకునేందుకు చంద్రబాబు పంట పొలాలను పరిశీలిస్తున్నారని అన్నారు. హుదూద్, తిత్లి తుపానులు సంభవించినప్పుడు చంద్రబాబు ఆయా ప్రాంతాలకు వెళ్లి పునరుద్ధరణ పనులను సమర్ధవంతంగా నిర్వహించిన గొప్ప నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడిని అర్ధరాత్రి పొలాల పరిశీలన ఏంటని వైసిపి నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. రైతుల కష్టాలను తెలుసుకొని మంచి మేనిఫెస్టో రూప కల్పనకు అర్ధరాత్రి సైతం పర్యటించారని అన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పంట పొలాలను పరిశీలించేందుకు గాలిలో వచ్చి, గాలిలో వెళ్లారని విమర్శించారు. రైతులతో మాట్లాడేందుకు బారికేడ్లు, పరదాలు కట్టుకుని రావటం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి సిఎం ప్రజలకు అవసరమా అని ప్రశ్నించారు. రైతులకు సకాలంలో సాగునీరు ఇచ్చి ఉంటే అక్టోబర్, నవంబర్ నెల్లో పంట చేతికి వచ్చేదని చెప్పారు. సాగునీరు ఇవ్వడంలో జగన్ ప్రభుత్వం విఫలం కావటం వల్లనే నేడు పంట నష్టం జరిగిందని అన్నారు. చంద్రబాబు పట్టిసీమ ద్వారా రైతులకు నీరు అందించి

విలేకర్ల సమావేశంలో ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్

అక్టోబర్, నవంబర్ నెల్లో పంట వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. చంద్రబాబుకు పేరు రాకూడదనే దురుద్దేశంతో అరాచక పాలన సాగిస్తున్న జగన్ రైతులకు నీళ్లు ఇవ్వకుండా ఆలస్యం చేశారని మండి పడ్డారు. ఈ క్రాప్ అనేది పెద్ద స్కామ్ అని 70వేల ఎకరాలు ఉంటే 20వేల ఎకరాలు ఈక్రాప్ నమోదు చేసి వైసిపి పెద్దల పేర్లతో పంట నమోదు చేసుకొని దోచుకున్నారని ఆరోపించారు. బేతపూడిలో ఈ స్కామ్ బయటపడిందని అన్నారు. ఇద్దరు వీఆర్వోలు సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు నష్టపరిహారం అందించే వరకు పోరాడుతామని అన్నారు. ఆక్వా రైతులను కూడా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, పంతాన్ని మురళీధరరావు, జనసేన మండల అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ పాల్గొన్నారు.

రైతుల కష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళతా

మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని పేటేరు పరిసర ప్రాంతాలలో ఇటీవల తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలను కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైకరి కారణంగానే ఇంత పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగిందని ఆరోపించారు. దీనికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. నష్ట పోయిన ప్రతి ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళి తగిన న్యాయం జరిగేటట్లు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా 100మంది రైతు, కూలీలకు కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రెసిడెంట్ గంటా అంజిబాబు, పిసిసి ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాష్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సతీష్, తాడికొండ వెంకటేశ్వరరావు, వేమూరు ఇన్చార్జ్ కేసన వెంకట జగదీష్, శొంఠి గోపి, పేటరు రూరల్ కన్వీనర్ సురేష్ గౌడ్, పేటేరు అధ్యక్షులు వినోద్, రేపల్లె టౌన్ ప్రెసిడెంట్ స్వామి నారాయణమూర్తి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : తుఫానుకు కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందజేయాలని మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం డిమాండ్ చేశారు. మండలంలోని వేమవరం, అద్దేపల్లి గ్రామాలలో ఆయన

దెబ్బతిన్న వరి పంట పరిశీలిస్తున్న మాజీ కేంద్ర మంత్రి శీలం

స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి దెబ్బతిన్న పంటలను శనివారం పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఏడుకొండలు, గౌస్ బేగ్ ఉన్నారు.

పర్చూరు : వరద ముంపుకు గురైన పంటలకు ఇన్పుట్ సబ్సిడీని తక్షణమే ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి జెడీ శీలం డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకి రుణమాఫీ చేయాలని కోరారు. కారంచేడు, పర్చూరు మండలాల్లో దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న ప్రతి ఎకరానికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఎంపీ నిధులు రాష్ట్రానికి ఉపయోగించటం లేదని, పోలవరం పూర్తి చేయలేదని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడే ధైర్యం లేదని దుయ్యబట్టారు. అమరావతి రాజధాని విషయంలో, గుంటూరు ఛానల్ను పర్చూరు వరకు పొడిగించడంపై దృష్టి పెడతామని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంట అంజిబాబు, ప్రకాష్, తోట శివనాగేశ్వరరావు, జానకిరాం, బాపట్ల, వేమూరు నాయకులు పాల్గొన్నారు.

మూసి బ్రిడ్జిపై గుంతలు..తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి - పొదిలి

వంతెనపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

మండల సరిహద్దులోని మూసివాగు బ్రిడ్జిలపై గుంతలు ఉన్నాయి. దీంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. మండలానికి రెండు వైపుల మూసివాగు సరిహద్దుగా ఉంది. పొదిలి - దర్శి, పొదిలి - ఒంగోలు మార్గాల్లో ఉన్న గురవాయపాలెం - రాజంపల్లి, ఉప్పలపాడు - మర్రిచెట్లపాలెం గ్రామాల వద్ద మూసి నదిపై ఉన్న బ్రిడ్జిలపై గుంతలు పడ్డాయి. వీటిలో ఒంగోలు మార్గంలోని బ్రిడ్జిపై గుంతలను తాత్కాలికంగా మట్టిపోసి పూడ్చారు. అయితే ఉన్నగురవాయపాలెం సమీపంలోని బ్రిడ్జిపై గుంతలు సుమారు అర్ధ అడుగు మేర లోతుకు పడటంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జిమీద ఉన్న ఈ గుంతలు దగ్గరికివచ్చే వరకు వాహన చోధకులకు కనిపించక పోవడంతో వేగంగా వస్తున్న వాహనాలు హఠాత్తుగా వాటిని చూసి బ్రేకులు వేయడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండు నెలల వ్యవధిలో సుమారు 35ప్రమాదాలు జరగగా 10నుండి 12 మంది క్షతగాత్రులయ్యారు. వేగంగా రావడం గుంతల్లో వాహనం అదుపు తప్పడం, రోడ్డు మీద పడిపోవడం ద్విచక్ర వాహన దారులకు నిత్యకృత్యమైంది. ఈ మార్గంలో రోజువారీ ప్రయాణించే వారు తప్ప కొత్తగా వచ్చేవారు ఖచ్చితంగా ప్రమాదాల బారిన పడుతున్నారంటే వాటి తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి కాంక్రీట్లో గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించాలని వాహన చోధకులు కోరుతున్నారు.

నీట మునిగిన మినుము పంటను పరిశీలిస్తున్న బలరాం

మినుమును పరిశీలించిన బలరాం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చీరాల

తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట పొలాలు మునిగి రైతులు నష్టపోయారంటూ ప్రజాశక్తి దినపత్రికలో "రైతు కంట కన్నీరు" అనే శీర్షికతో శనివారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి స్పందించారు. మండలంలో బోయినవారిపాలెం, దేవీనూతల, కావూరివారిపాలెం, గవినివారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, తోటవారిపాలెం గ్రామాలలో ఆయన శనివారం పర్యటించారు. ముంపుకు గురైన పొలాల్లో పంట నష్టం అంచనా వేసి వెంటనే పరిహారం అందేలా చేయాలని అధికారులను ఆదేశించారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలను నూతనంగా పునరుద్ధించి విద్యుత్ పునరుద్ధరించాలని అన్నారు. ఆయన వెంట అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైసిపి మండలం అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ బోయిన కేశవులు, బిట్ర శ్రీనివాసరావు, పృథ్వి ధనుంజయ, బుర్ల మురళీకృష్ణ, పిట్టు పోలయ్య, బుర్ల సాంబ శివరావు, బొంతగొర్ల రాధాకృష్ణ, నాదెండ్ల కోటేశ్వరరావు, బక్కా అద్దంకిరెడ్డి, ఏడిఎ ఎఫ్రాయం పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

విద్యుత్తు ఉప కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

స్థానిక శిరిగిరి కొండమీద నూతనంగా ఏర్పాటు చేసిన 33/11కెవి విద్యుత్తు ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సబ్ స్టేషన్ వల్ల రెండు కిలోమీటర్ల పరిధిలో సంవృద్ధిగా విద్యుత్తు సరఫరా జరుగుతోందని తెలిపారు. నగరంలో విద్యుత్తు వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్ వెలనాటి మాధవరావు, ఎపిసిపిడిసిఎల్ డైరెక్టర్ రమాదేవి, వైసిపి నగర కన్వీనర్ కటారి శంకర్, గంటా రాము, కార్పొరేటర్ జడా వెంకటేష్ పాల్గొన్నారు.

రజక వేదిక ఆధ్వర్యంలో సంబరాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కేక్ కట్ చేస్తున్న రజక నేతలు

తెలంగాణలో షాద్నగర్ నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రజక ముద్దుబిడ్డ వీరపల్లి శంకర్ గెలుపొందడం పట్ల మండలంలోని వెల్లటూరు గ్రామంలో రజక వేదిక ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శనివారం ఆనందం పంచుకున్నారు. రజక ఐక్య వేదిక నాయకులు పోతారులంక రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. బీసీ వర్గాల్లో అతి తక్కువ సామాజిక వర్గమైన రజక కులానికి కాంగ్రెస్ సీటు కేటాయించి గెలుపొందేందుకు కృషి చేసిన తెలంగాణ సిఎం రేవంత్రెడ్డి, కాంగ్రెస్ అధిష్టాన నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చందోలు రవి, ఐనంపూడి నాగేశ్వరరావు, గోపి, రాంబాబు, సత్యనారాయణ, శివమణి పాల్గొన్నారు.

ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

చిన్నారిని ఎత్తుకొని..

యానాదుల భవితకు భరోసా కల్పిస్తాం

- కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణం
- నిత్యావసరాలు అందజేసిన టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-బాపట్ల

యానాదుల అభివద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా వారి భవితకు భరోసా కల్పిస్తామని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యానాదులకు హామీ ఇచ్చారు. శనివారం బాపట్ల పట్టణం, రాజీవ్‌గాంధీ కాలనీలో చంద్రబాబు పర్యటించారు. తుపాను ప్రభావం తర్వాత నీటమునిగిన యానాదుల నివాసాలను పాలకులు విస్మరించారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ తరపున సహకారాన్ని అందజేస్తామని వెల్లడించారు. యానాదులు నివసిస్తున్న ప్రతి గుడిసెకు వెళ్లి అక్కడి ప్రజల స్థితిగతులు తెలుసుకున్నారు. యానాదులతో మాట్లాడుతూ ఓ చిన్నారిని ఎత్తుకొని వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న ఈ కాలనీని స్థానిక నాయకులు ఏమాత్రం పట్టించుకోలేదని చంద్రబాబు ఆరోపించారు. కాలనీలో ఏమాత్రం సౌకర్యాలు కల్పించలేదని అక్కడివారు చంద్రబాబుతో మొరపెట్టుకున్నారు. కాలనీ మొత్తం తిరిగి పరిస్థితి తెలుసుకున్న చంద్రబాబు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అందజేసిన నిత్యవసరాలను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం నరేంద్రవర్మ అందిస్తారని ప్రకటించారు. అనాదిగా యానాదులు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారని, ఎన్టీఆర్ కాలం నుండి టిడిపితోనే ఉన్నారని చెప్పారు. కాలనీలో ఉన్న మురుగు కాలువ ద్వారా పాములు సంచరిస్తున్నాయని అక్కడివారు చంద్రబాబు దష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన చంద్రబాబు .. పాములే కాదు మొసళ్లు కూడా వస్తాయని బదులిచ్చారు. రాజీవ్‌గాంధీ కాలనీ పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే పాలకులకు ఏమాత్రం పట్టకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ తరఫున ఈ కాలనీవాసులను ఆదుకుంటామని తెలిపారు. ఇక్కడ నివాసం ఉంటున్న యానాదుల జీవన స్థితిగతులపై ప్రత్యేకమైన జిల్లా హెడ్ క్వార్టర్‌గా ఉన్న బాపట్లలో యానాదుల పరిస్థితి దయనీయంగా ఉండడం బాధాకరమన్నారు. అనంతరం బాపట్ల మండలం, కంకటపాలెం గ్రామానికి చేరుకున్న చంద్రబాబుకు గజమాలతో స్వాగతం పలికారు. అదేవిధంగా నరసాయపాలెం గ్రామంలో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి చంద్రబాబు నివాళులర్పించారు. కార్యక్రమంలో పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఇనగంటి గాంధీ, పార్టీ నాయకులు గొలపల శ్రీనివాసరావు, తాతా జయప్రకాష్ నారాయణ, ఫరీద్ షేక్, షకా, వడ్లమూడి వెంకటేశ్వరరావు, కంకటపాలెం నర్సాయపాలెం గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

యానాది కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చంద్రబాబు

గుంటూరు ఛానల్ సమస్యను పరిష్కరించాలి

పర్చూరు: గుంటూరు ఛానల్‌కు వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని రైతాంగం చేస్తున్నటువంటి ఉద్యమాలకు మద్దతు తెలియజేయాలని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హామీని అమలుచేయాలని అఖిలపక్ష గుంటూరు ఛానల్ సాధన సమితి నేతలు కోరారు. శనివారం పర్చూరు మండలం వీరన్నపాలెంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకి సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ నరిశెట్టి ఆచార్యులు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ ప్రాంత రైతాంగం ప్రజలు పోరాటాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని, అనేక పోరాటాలు జరిగిన హామీలకే పరిమితం అవుతున్నారని పేర్కొన్నారు. కావున గుంటూరు ఛానల్ సమస్య పరిష్కారానికి చంద్రబాబు పూనుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే కచ్చితంగా గుంటూరు ఛానెల్‌ని నిర్మించి తీరుతామని హామీ ఇచ్చారు .కార్యక్రమంలో అఖిలపక్ష గుంటూరు ఛానల్ సాధన సమితి కో-కన్వీనర్ కుర్ర హరిబాబు, తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, జిడిసిసి మాజీ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, నాయకులు గింజుపల్లి శివరాంప్రసాద్, ఎం.సాంబశివరావు, కోటపాటి సదాశివరావు, సర్పంచుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు కల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం నేతలతో చంద్రబాబు భేటీ

బాపట్ల జిల్లా: తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించేందుకు బాపట్ల జిల్లా వచ్చిన నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి ప్రకాశంజిల్లా ఎమ్మెల్యేలు,నియోజవర్గ ఇన్‌ఛార్జిలతో శనివారం భేటీ అయ్యారు. తుఫాన్ ప్రభావం, నియోజకవర్గాల వారీగా పంట నష్టపోయిన వివరాలు, శుక్రవారం రాత్రి గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో గేటు ఊడిపోవడం తదితర తాజా రాజకీయ పరిస్థితులపై నేతలతో చర్చించారు. పలు సమస్యలపై పోరాడాల్సిన అంశాల గురించి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

చంద్రబాబుకు అర్జీ ఇస్తున్న గుంటూరు ఛానల్ సాధన సమితి నేతలు

ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో మాట్లాడుతున్నచంద్రబాబు

భవిష్యత్తులో గుండ్లకమ్మ ప్రాజెక్టు ఉండదేమో.?

- రైతుల ఆనందం క్షణాల్లో మాయం
- ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమిస్తాం
- ప్రాజెక్టును పరిశీలించిన రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-మద్దిపాడు

గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో నెంబర్ గేటు విరిగి.. నీరంతా సముద్రం పాలవుతుందని, తాజా పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తులో అసలు గుండ్లకమ్మ ప్రాజెక్టు ఉండదేమోనని రైతుసంఘం నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లవరంలో గుండ్లకమ్మ ప్రాజెక్ట్ రెండో గేటు విరిగిపోవడంతో ప్రాజెక్టును శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు రెండో గేటు విరిగిపోవడం బాధాకరమన్నారు. ప్రాజెక్టు మెయింటెన్స్ సరిగా లేదన్నారు. గుండ్లకమ్మకి నీళ్లు వచ్చాయిలే అని సంతోషపడే లోపే రైతాంగానికి కన్నీళ్లే మిగిలాయని చెప్పారు. రైతాంగానికి కంటిమీద కునుకు లేదన్నారు. గతేడాది మూడో నెంబర్ గేటు కొట్టకుపోయి డ్యాంలో చుక్కనీరు లేదని చెప్పారు. దానిని బాగు చేయాలని ఆందోళనలు, ధర్నాలు, పాదయాత్రలు చేసి.. అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ప్రాజెక్టు గేట్లు రిపేరు కోసం ప్రభుత్వం రూ.తొమ్మిది కోట్లు కేటాయించిందని అంటున్నారని కానీ ప్రకటనలకే అది పరిమితమైందని చెప్పారు. రైతాంగ సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని, రాష్ట్రంలో ఉన్న అన్నమయ్య, పులిచింతల, రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చేసిన ప్రకటన ఆశ్చర్యం కలిగించిందన్నారు. 1.5 టిఎంసి నీళ్లను నిలబెట్టి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుంటామని చెప్పడం వారిని మోసం చేయడమేనన్నారు. మూడో నెంబర్ గేటు కొట్టకపోయి ఏడాది దాటినా ఇంతవరకు దాని బాగు చేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో ప్రాజెక్టు గేట్లు రిపేరు చేసి తాగు, సాగునీరు అందించాలని కోరారు. లేకపోతే ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టును పరిశీలించిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంత్‌బాబు, పమిడి వెంకటరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే బాబు, వి.బాలకోటయ్య, కౌలురైతు సంఘం నాగులపాడు మండల కార్యదర్శి శ్రీకాంత్, మద్దిపాడు మండల రైతు సంఘం కార్యదర్శి కనపర్తి సుబ్బారావు, ఉబ్బ వెంకటేశ్వర్లు, శ్రీను, బసవపు పున్నయ్య, కాకాని సుబ్బారావు, వెంకటేశ్వర్లు, అంకమ్మ పాల్గొన్నారు.

అన్నదాత కుదేలు

తుపాను మిగిల్చిన నష్టం.. చేతికందే పంటలు చేజారిన విషాదం.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా గుండ్లకమ్మ మరో గేటు తెగినీరంతా సముద్రం పాలవడం.. కరువులో ఆదుకునే నీళ్లన్నీ రైతుల కళ్ల ముందే వృథాగా పోవడం.. వెరసి రైతులు అన్ని విధాలా కుదేల య్యారు. ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. విపత్తుల్లో హామీలు తప్ప ఆచరణలో ఆదుకునే చర్యలు లేక బాధితులుగా రైతులు మిగిలిపోతున్నారు. తుపానుకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని సిఎం జగన్ బాపట్ల జిల్లా పర్యటనలో ప్రకటించారు. రైతులను పట్టించుకోలేదని ప్రతిపక్ష నేత చంద్రబాబు అదే జిల్లాలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇద్దరూ ఒకే రోజు బాపట్ల జిల్లాలో పర్యటించారు. రాజకీయంగానూ వేడెక్కింది. తుపాను వల్ల రెండు జిల్లాల్లో భారీగానే పంట నష్టం జరిగింది. ఇంకా అంచనాలు వేయలేదు. ప్రకాశం జిల్లాలోనే 60 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోగా..బాపట్ల జిల్లాలో వరి రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. రూ.వందల కోట్ల నష్టం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఏ మేరకు ఈ బాధిత రైతులను ఆదుకుంటుందనేదీ చూడాలి. మరోవైపు ఖరీఫ్ నుంచీ కరువు పరిస్థితులు కొనసాగుతున్నాయి. సాగర్ కాలువలకు నీళ్ల లేవు. అయితే తుఫాను వల్ల భారీ వర్షాలు కురిశాయి. అన్ని రకాల పంటలూ దెబ్బతిన్నాయి. ఈ తరుణంలో ఆర్థిక నష్టం ఎంతనేది తేల్చలేదు. అందుకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని అధికారులంటు న్నారు. పెట్టుబడులు, పంట చేజారితే జరిగే నష్టం అన్ని కోణాల్లో ఎన్యూమరేషన్ జరగాల్సి ఉంది. వర్షాలకు పంటలు మునగ్గా.. ఆర్థికంగా రైతులు ముని గారు. కౌలు రైతులు ఎక్కువగా నష్టపోయారు. మళ్లీ పంటల సాగుకు కూడా సమయం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

గుండ్లకమ్మపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం మరోసారి కొంపముంచింది. ప్రాజెక్టు రెండో గేటు శుక్రవారం రాత్రి కొట్టుకుపోయింది. నీరంతా సముద్రం పాలవుతోంది. ఏడాది క్రితం ఒక గేటు పోయింది. దీనికి తాత్కాలికంగా ఎలిమెంట్లు పెట్టారు. ఇప్పటికీ రిపేర్లు చేయలేదు. టెండర్లు పిలు స్తున్నారు. పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో బిల్లులు చెల్లించ లేదని.. పనులు చేస్తే బిల్లులు ఇస్తారో, లేదో అనే అనుమానం కాంట్రాక్టర్లలో ఉంది. దీంతో మరమ్మతులు చేపట్టలేక అధికారులు చేతులెత్తేశారు. హఠాత్తుగా తుపాను రావడం ప్రాజెక్టు నిండ టం జరిగాయి. ఇప్పటికే దెబ్బతిన్న గేట్లు నీటిని ఆపలేకపోయాయి. రెండో నెంబరు గేటు అమాం తం కొట్టుకుపోయింది. గుండ్లకమ్మ దిగువభాగాన్ని చూస్తే సముద్రాన్ని తలపిస్తోంది. ఈ నీరంతా రేపు ఆరుతడి పంటలకు ఉపయోగపడేది. ఇప్పుడు నీటిని ఆపలేని పరిస్థితి. మరమ్మతులు చేపట్ట డానికి కూడా వీల్లేకుండా పోయింది. నీటిమట్టం తగ్గితే తప్ప అక్కడ తాత్కాలికంగా ఎలిమెంట్లు పెట్టే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో రిజర్వాయర్ నుంచి నీటిని బయటకు పంపుతున్నారు. ఇదంతా కేవలం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లేనని తెలుగుదేశం ఎమ్మెల్యేలు, రైతుసంఘంనేతలు ఆరోపించారు. ఇప్పటికైనా పాలకపక్ష నేతలు కళ్లు తెరిచి గుండ్లకమ్మపై దృష్టి సారించాలి.

తెలంగాణా ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ చర్చలో మార్పు వస్తోంది. భారీ మార్పులు దిశగా పార్టీల్లో నిర్ణయాలు జరిగేలా కనిపిస్తున్నాయి. వైసిపి సిట్టింగు ఎమ్మెల్యేల్లోనూ కలవరం మొదలైంది. మార్పులు భారీగానే ఉంటాయనే చర్చ ముందుకు వచ్చింది. మూడు ఎస్సీ నియోజక వర్గాల్లో ఇప్పటికే మార్పులు జరిగాయి. మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్ ఇప్పుడున్న చోట కాకుండా వేర్వేరు నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నారు. తెలుగుదేశం నుంచీ గట్టి అభ్యర్థులు సిద్ధమయ్యారు. ఇప్పుడున్న ఇన్‌ఛార్జిలు, ఎమ్మెల్యేలకే టిక్కెట్లు ఖరారయ్యాయి. ఎన్నికలు సమీపిస్తున్నందున రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది.